

## ప్రకృతి విపత్తుల్లో ప్రజల రక్షణకు సిద్ధంగా ఉన్నాం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** వాతావరణ శాఖ సూచన మేరకు రాబోయే రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల రక్షణ కోసం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ ప్రాంతంలో గల చెరువును డీసీపీ ఎ భాస్కర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కాజ్ వే లు, వాగులు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని అన్నారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను వరద పరిస్థితుల దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చినా ఎదుర్కునేందుకు 90 మంది సభ్యులతో మూడు ఎస్ డీఆర్ఎఫ్ బృందాలు, జిల్లా అధికారులతో సిద్ధంగా ఉన్నామని, ప్రజల రక్షణకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉంచడం జరిగిందని అన్నారు. పోలీసు అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రభుత్వ సూచన మేరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, జిల్లాలోని పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజల రక్షణకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ మనుగడకు మొక్కలే ఆధారం

### వన మహోత్సవంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మానవ మనుగడకు మొక్కలే ఆధారమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం యాపల్‌గూడలోని సెకండ్ బెటాలియన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "మామిడి మధుబన్" కార్యక్రమంలో భాగంగా 600 మామిడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ముఖ్య అతిథులుగా సెకండ్ బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఇతర అధికారులు బెటాలియన్ ఆవరణలో "మామిడి మధుబన్" పేరుతో ఏర్పాటు చేసిన విస్తృత మామిడి తోటలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం బెటాలియన్ సిబ్బందితో కలిసి అత్యవసర పరిస్థితుల్లో స్పందించగల శిక్షణ పొందిన వంద మందితో ఎస్డిఆర్ఎఫ్ బృందం వరదల వంటి అత్యవసర సందర్భాల్లో ప్రజలకు సహాయం చేయడం కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన డెమోను తిలకించారు. అనంతరం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ తదితర అంశాలపై శిక్షణ పొందిన సిబ్బందిచే డెమో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు సిద్దంగా ఉండేందుకు 24 గంటలూ అప్రమత్తంగా ఉండే బృందాలు సిద్ధంగా ఉండాలని అన్నారు. వర్షాలు, వరదలు, విపత్తుల సమయంలో ప్రజలకు అత్యవసర సహాయాన్ని అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పదవీ కాలం పొడిగింపు హర్షణీయం



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** పీఏసీఎస్ చైర్మన్, పాలకవర్గాల పదవీ కాలం మరో ఆరు నెలలు పొడిగించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు బెజ్జూర్ పీఏసీఎస్ అధ్యక్షులు కురిసింగ ఓంప్రకాష్ కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. పీఏసీఎస్ పాలకవర్గాల పదవీ కాలం మరో ఆరు నెలలు పొడగించడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ పదవీ కాలం పొడగింపుకు కృషి చేసిన డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజా రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్‌కు బెజ్జూర్ పీఏసీఎస్ పాలకవర్గ సభ్యుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గాల పదవీకాలం పొడిగించిన ముఖ్యమంత్రి, సహకార శాఖ మంత్రి చిత్రపటాలకు శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయం ముందు పాలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



# శిథిలావస్థకు తహసీల్ కార్యాలయం

### కవర్ కప్పి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టిన అధికారులు

ఉద్యమ కెరటం, జైనూర్ : మండల రెవెన్యూ కార్యాలయం. విలువైన భూక్రయవిక్రయాలకు తలమానికం. కానీ అక్కడ విధులు నిర్వహించాలంటే సిబ్బందే కాదు. అధికారులూ భయంతో కాలం వెల్లదీయాల్సి వస్తోంది. ఎప్పుడు ఏమవుతుందోననే ఆందోళనతో నెట్టుకురావాల్సి వస్తోంది. రెవెన్యూ అధికారులకు భయమా.. అంటే అవును ఆ భయానికి కారణమేమంటారా.. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలమైన జైనూర్ తహసీల్దార్ భవనం అతి పురాతన భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం వచ్చిందంటే చాలు భవనం పైకప్పు ( స్లాబ్ ) లికీజ్ అవుతుంది. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని అధికారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తహసిల్దార్ కార్యాలయం పైకప్పు లీకేజీ కావడంతో వర్షపు నీటితో కార్యాలయంలో ఉన్న దస్తావేజులు, రిజిస్టర్ లు, కంప్యూటర్ పరికరాలు తడిసిపోతున్నాయి. దీంతో అధికారులు స్లాబు పై కవర్ కప్పి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. ఉన్నత అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



### నూతన భవనం నిర్మించాలి



తహసిల్దార్ కార్యాలయం చాలా పురాతనమైనది. ప్రస్తుతం పైకప్పులో లీకేజీ కావడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన భవనం కోసం ప్రపోజల్స్ పంపించినట్లు సమాచారం ఉంది. కానీ సంబంధించిన అధికారుల చర్యలు కనబడలేవు. అందుకే ఇప్పటివరకు కార్యాలయం నూతన భవనం కానట్టు కనిపిస్తుంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలి.

- షేక్ ఫజల్, సామాజిక కార్యకర్త, జైనూర్

### ఉన్నతాధికారులు స్పందించాలి



జైనూర్ మండల తహసిల్దార్ కార్యాలయం పై కప్పు నుంచి లీకేజీ కావడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసిల్దార్ కార్యాలయంలో లీకేజీ తో దస్తావేజులు, రిజిస్టర్ లు, కంప్యూటర్ పరికరాలు తడిసిపోతున్నాయి. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి జైనూర్ మండలం లో వెంటనే నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం మంజూరు చేయాలి.

- అసద్‌అలీ, మౌలానా
ఆజాద్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్

### సమస్య పరిష్కరించాలి




జైనూర్ మండల తహసిల్దార్ కార్యాలయంలో పైకప్పులో లీకేజీ ఉండడంతో అధికారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలో సిబ్బంది భయం ఆందోళనలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు వెంటనే స్పందించి మండల తహసిల్దార్ కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలి.

- బుతలే కిరణ్ , జైనూర్

# 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి

### రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి






**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** వచ్చే 3 రోజుల్లో రానున్న 24 గంటలు అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో వర్ష పరిస్థితుల్లో ప్రజా రక్షణ దిశగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ వాతావరణ సూచన మేరకు వచ్చే 3 రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం దని, ఈ నేపథ్యంలో రానున్న 24 గంటలు మరింత కీలకమైన సమయమని, ప్రజల రక్షణ దిశగా అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసించే వారిని వెంటనే తరలించాలని, వాగులు, నదులు ఉదృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా అడ్డుకొని సిబ్బందితో పహారా చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, రహదారులు, కల్వర్టులు దెబ్బతింటే ఆ ప్రాంతంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తాగు నీటి ఇబ్బంది లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో సహాయక చర్యల నిమిత్తం ప్రతి జిల్లాకు కోటి రూపాయలు విడుదల చేయడం జరిగిందని, ఉమ్మడి జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించడం జరిగిందని తెలిపారు. సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసి వెనక్కు పిలిపించాలని, రైల్వే లైన్లు, లోలెవెల్ వంతెనలు, కాజ్ వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ సుభాష్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి జిల్లాలోని రెబ్బెన, తిర్యాణి, కాగజ్ నగర్, ఆసిఫాబాద్, కౌటాల, దహేగాం మండలాలలో కురిసిన భారీ వర్షం కారణంగా వాగులు, ఒర్రెలు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని తెలిపారు. జిల్లాలోని 13 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. 13 లోలెవెల్ కాజ్ వేల వద్ద ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పంచాయితీ రాజ్ రహదారులపై కల్వర్తులు మూడు చోట్ల కొంతమేర దెబ్బతినడం జరిగిందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, జిల్లా యంత్రాంగం రాబోయే మూడు రోజులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అప్రమత్తత చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు తక్షణ సహాయం కోసం కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించడం జరుగుతుందన్నారు. తాగు నీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, పంచాయితీ రాజ్ ఈఈ ప్రభాకర్, విద్యుత్ శాఖ ఎస్ఈ. శేషరావు, నీటిపారుదల శాఖ ఈఈ గుణవంత్ రావు, మిషన్ భగీరథ ఈఈ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

